

# శ్రీ షిరిడీ సాయివైభవమ్

సంపుటి 1 సంచిక 6 మే 2018

శ్రద్ధ సబూరి

సాయిదర్బార్, హైదరాబాద్

వ్యవస్థాపకులు, సలహాదారు : సాయిబానిస శ్రీరావాడ గోపాలరావు గారు

నిర్వహణ : ఆత్రేయపురపు త్యాగరాజు, నిజాంపేట, హైదరాబాద్

కాకా సాహెబ్ దీక్షిత్ డైరీ

## పనికిమాలిన పరనింద:

మధురదాస్ అనే భక్తుడు తరచూ షిరిడీ వచ్చి బాబాను దర్శిస్తూ ఉండేవాడు. ఒకసారి షిరిడీ వచ్చినపుడు అక్కడ హోటలు నడుపుతున్న సగుణమేరు నాయక్ వద్ద బస చేశాడు.

సగుణ హోటలులో యాత్రికులందరూ భోజనాలు చేస్తూ ఉండేవారు. అక్కడ వారిద్దరూ కలిసి ఇతరుల లోని లోపాల గురించి వారి వ్యవహారాల గురించి పిచ్చాపాటీ మాట్లాడుకుంటూ కాలక్షేపం చేస్తూ ఉండేవారు. తరువాత మధుర్ దాస్ శ్రీసాయిబాబా వద్దకు వెళ్ళి ఆయన ప్రక్కన కూర్చున్నాడు. "సగుణ ఏమంటున్నాడు" అని బాబా అడిగారు. మధుర్ కి తాను చేసిన సంభాషణ వెంటనే గుర్తుకు వచ్చింది. తను చేసిన తప్పు శ్రీసాయిబాబాకు తెలిసిందని అర్ధమయింది. ఇతరులలోని దోషాలను వేలెత్తి చూపడం, నిందారోపణ ఇవేమీ బాబాకు యిష్టముండదని మాధుర్ కి గుర్తుకు వచ్చింది. మనకి యితరుల విషయాలలో జోక్యం చేసుకోకూడదని బాబా మధుర్ కి గుర్తు చేస్తూ, మనకి ఏదయితే ప్రాప్తమో అదే మనవద్ద ఉంటుంది, యితరులకి ఏది ప్రాప్తమో అదే వారి వద్ద ఉంటుందని ఈ విధంగా తెలియచేశారు.

## స్వప్నంలో వైద్యం:

శాంతాబాయి బాబా భక్తురాలు. శాంతాబాయి యొక్క ఎడమ చేతివేళ్ళు కురుపులు వేసి పురుగులు పట్టి భరింపలేని బాధ పడుతూ ఉండేది. ఆమెను ఈ బాధనుండి తప్పించడానికి శ్రీసాయిబాబా ఒకసారి ఆమెకు స్వప్నంలో కనపడి నెప్పిగా ఉన్న చేతికి, వేళ్ళకి దికామలీ - ఒక విధమయిన మూలిక (కాంబీ గమ్ ) రాయమని చెప్పారు. తనకి స్వప్నంలో శ్రీసాయిబాబా యిచ్చిన ఈ సలహాకి సంతోషించి ఆయన చెప్పినట్లే చేసింది. ఆమె ఆ కాంబీ గమ్ ను చేతికి రాసిన కొద్ది క్షణాలలోనే నొప్పి, వాపు తగ్గిపోవడంతో అందరూ ఆశ్చర్యపోయారు. ఈ విషయం సెప్టెంబరు 1, 1918,న షిరిడీకి వచ్చిన ఉత్తరంలో తెలియచేయబడింది.

## ఊదీ చికిత్స:

బొంబాయి వాస్తవ్యుడయి నారాయణ్ గోపీనాధ్ డిగెకి ప్రేవులలో నొప్పిగా ఉండేది.రోజు రోజుకీ నొప్పి ఎక్కువ కాసాగింది. అతని స్నేహితుడు శ్రీసాయిబాబా భక్తుడు. అతను నారాయణ్ ని షిరిడీ వెళ్ళమని సలహ్ యిచ్చాడు. తనకు వచ్చిన సమస్యను బాబాకు వివరించమని ఆయన నయం చేస్తారని చెప్పాడు. కాని తన పరిస్థితి చాలా ఆందోళనకరంగా ఉండటంవల్ల తాను షిరిడీ వరకు ప్రయాణం చేయలేనని చెప్పాడు. ఏమయినప్పటికీ శ్రీసాయిబాబా అనుగ్రహం వల్ల తనకు పూర్తిగా నయమవుతుందనే

గట్టి నమ్మకంతో ఉన్నాడు. తనకు నయమవుతే షిరిడీ వచ్చి శ్రీసాయిబాబాను దర్శించుకుని సాష్టాంగ నమస్కారం చేస్తానని మొక్కుకొన్నాడు.

అతని స్నేహితుడు ఊదీ ఇచ్చి ప్రతీరోజు దానిని నుదిటికి రాసుకోమని చెప్పాడు. నారాయణ్ అతను చెప్పినట్లే చేశాడు. మరుసటి రోజే అతని బాధ నయమయింది. వారం రోజులలోనే అతని బాధ పూర్తిగా నయమయి పూర్తి ఆరోగ్యం చేకూరింది. అతను షిరిడీ వెళ్ళి శ్రీ సాయిబాబాను దర్శించుకోవడానికి బయలుదేరాడు.

మరొక సంఘటనలో జోషీ యొక్క కుమార్తె చాలా సంవత్సరాలనుండి తీవ్ర అనారోగ్యంతో బాధ పడుతూ ఉండేది. ఒకరోజున ఆమె పరిస్థితి చాలా ప్రమాదకరంగా అయి చావుకు దగ్గరలో ఉంది. ఆమె తల్లి బాబాను ఆర్తితో ప్రార్థించి ఊదీనిచ్చింది. వెంటనే ఆమె ఆరోగ్యం మెరుగవడం ప్రారంభించింది కాని పూర్తి ఆరోగ్యం చేకూరలేదు. ఒకరోజు జోషి తన భార్యతోకూడా కుమార్తెను తీసుకుని షిరిడీ వచ్చాడు. చాలా కాలంపాటు అనారోగ్యంగా ఉండటం వల్ల జోషి కుమార్తె బలహీనంగా ఉండి నడవలేని పరిస్థితిలో ఉంది. తల్లిదండ్రులు ఆమెను ఎత్తుకుని ద్వారకామాయిలోని బాబా వద్దకు తీసుకొని వెళ్ళారు. ఆయన ఆమె నుదుటిమీద ఊదీని రాసి ఆశీర్వదించారు. మూడు రోజులలో ఆమె పూర్తిగా కోలుకొని తనకు తానే ఎవరి సహాయం లేకుండా నడవగలిగింది. అదే ఊదీయొక్క అద్భుతమయిన శక్తి.

సాయి దిద్దిన కాపురం:

ఈసంఘటన 1913వ.సంవత్సరంలో జరిగింది. దహనుకు చెందిన శ్రీజీ.కే. వైద్య ఒకసారి శ్రీసాయిబాబా దర్శనానికి షిరిడీ వచ్చాడు. అతను శ్రీసాయిబాబాతో సంతోషంగా గడిపాడు. షిరిడీనుంచి తిరిగి వచ్చిన తరువాత తన అన్నగారయిన ఆత్మారాం ని కూడా షిరిడీ వెళ్ళమని సలహా యిచ్చాడు. తన తమ్ముడు చెప్పినమీదట ఆత్మారాం కూడా షిరిడీ వచ్చి శ్రీసాయిబాబాను దర్శించుకున్నాడు. అప్పుడు అతని వయస్సు 42 సంవత్సరాలు. సుమారు 38 సం.ఉన్న అతని భార్య, యిద్దరిమధ్య ఉన్న కొన్ని మస్పర్థలవల్ల అతనిని విడిచి పుట్టింటిలోనే ఉండసాగింది. భర్త దగ్గరకు రాలేదు. వివాహము అయిందన్న మాటేగాని వారు కలిసి కాపురం చేసింది లేదు, ఇక కాపురం చేయలేని పరిస్థితి ఏర్పడింది. ఇరువైపుల పెద్దలు ఎంత ప్రయత్నించినప్పటికీ ఆమె తనభర్త వద్దకు తిరిగి వెళ్ళటానికి ససేమిరా నిరాకరించింది.ఆత్మారాం షిరిడీ వచ్చి బాబా ఊదీ ప్రసాదం తీసుకున్న సమయంలోనే పుట్టింటిలో ఉన్న ఆయన భార్యకు ఏదో ప్రేరణ కలిగి వెంటనే అత్తవారింటికి వెళ్ళింది. తన మరిదితో (జీ.కే.వైద్య) నిజానికి ఇదే నాల్లు, పుట్టింటిలో ఎక్కువ కాలం ఉండటం భావ్యం కాదని చెప్పింది. హటాత్తుగా ఆమెలో వచ్చిన ఈ మార్పుకి వైద్య ఆశ్చర్యపోయారు. ఆతరువాత ఆత్మారాం దంపతులు ఎటువంటి పొరపొచ్చాలు లేకుడా పిల్లాపాపలతో హాయిగా కాపురం చేశారు.

నాబిడ్డలను నేనుకాక మరెవరు కాపాడతారు

1914 వ.సం.లో శ్రీ ఎన్.బీ.నాచ్నే దహనులో ట్రెజరీ మాస్టర్ గా పనిచేస్తూ ఉండేవారు. అక్కడ శ్రీ ఫాన్సే కూడా ఉద్యోగి. ఫాన్సేకు మతి స్థిమితం లేదు.

ఒకసారి శ్రీనాచ్నే తన వంటగదిలో ఉన్న శ్రీసాయిబాబా పటం ముందు పూజ చేసుకుంటున్నారు. హటాత్తుగా అతనికి పెద్ద శబ్దం వినపడింది. వెను తిరిగి చూసేటప్పటికి వంటగది గుమ్మం వద్ద ఫాన్సే నిలబడి ఉండటం చూశాడు. అతను వేగంగా నాచ్నే మీదకు దూకి అతని గొంతును గట్టిగా పట్టుకుని నొక్కుతూ కొరకడానికి ప్రయత్నించాడు. నాచ్నే ఏదో విధంగా పూజకు ఉపయోగించే ఉద్ధరిణి తీసుకుని నాచ్నే నోటిలో గుచ్చాడు. ఫాన్సే వెంటనే నోరు మూసుకుని అతని వేళ్ళని కొరకడం మొదలు పెట్టాడు. ఫాన్సే నాచ్నే మెడను గట్టిగా పట్టుకోవడం వల్ల అతని గోళ్ళు గట్టిగా గొంతులో దిగబడి విపరీతంగా రక్తం కారసాగింది. ఈదాడికి నాచ్నే స్పృహ తప్పి పడిపోయాడు. అతనికి తిరిగి స్పృహ వచ్చేటప్పటికి తన చుట్టు తన తల్లి, తమ్ముడు. డాక్టర్ ఉండటం చూశాడు. సరైన సమయానికి తన తల్లి, తమ్ముడు వచ్చి ఆ పిచ్చివానినుండి రక్షించారని తెలిసింది. కొద్ది రోజుల తరువాత అతను షిరిడీ వెళ్ళాడు. అతను మధ్యాహ్నం ద్వారకామాయికి వెళ్ళినపుడు శ్రీసాయిబాబా నాచ్నే వైపు చూపుతూ, తన దగ్గర కూర్చున్న అన్నా చించణీకర్ తో ఇలా అన్నారు. "నేనొక్క క్షణం ఆలశ్యం చేసి ఉంటే ఆపిచ్చివాడు యితనిని చంపేసి ఉండేవాడు. అతని మెడను బాగా బలంగా బిగించి పట్టుకున్నపుడు నేనక్కడకు వెళ్ళి అతనిని చావునుంచి తప్పించి రక్షించాను. నాబిడ్డలను నేని రక్షించకపోతే మరెవరు రక్షిస్తారు.

అతి తెలివి:

నా పొరుగున ఉండే ఆనందరావు కృష్ణ చౌబాల్ తన తల్లితో నివసిస్తూ ఉండేవాడు. ఒకసారి అతను తన తల్లితో కూడా నాతో షిరిడీ వచ్చాడు. అతని తల్లి చదువుకున్నది, తెలివైనది. ఆమె శ్రీసాయిబాబాకు 8 అణాలు దక్షిణ యిద్దామనుకుంది. ఆవిడ తన కొడుకుని ఒక రూపాయికి చిల్లర తెమ్మని చెప్పింది. అతను ఒక అర్ధరూపాయ నాణెం, రెండు పావలా నాణాలు తెచ్చి తల్లికిచ్చాడు. ఆవిడ శ్రీసాయిబాబాను దర్శించుకుని పావలా నాణెం మాత్రమే దక్షిణగా యిచ్చి తిరిగి వెళ్ళబోయింది.. శ్రీ సాయిబాబా ఆమెను వెనుకకు పిలిచి ఆవిడ అనుకున్న ప్రకారం మరొక పావలా అడిగారు. " మిగిలిన నాలుగు అణాలు నాకు యివ్వకుండా ఎందుకమ్మా ఈ బీద బ్రాహ్మడిని మోసం చేస్తావు" అన్నారు బాబా. ఇది వినగానే ఆమె తాను చేసిన పనికి సిగ్గుపడి మిగిలిన దానిని దక్షిణగా సమర్పించుకొంది.

షిరిడీమార్చే పండరీపూర్:

శంకరరావు తల్లి ఒకసారి షిరిడీ వెళ్ళి అక్కడినుండి పండరీపూర్ ఇంకా మిగతా పుణ్యక్షేత్రాల యాత్రలకు వెడదామని నిర్ణయించుకుంది. ఆమె తాను అనుకున్న ప్రకారం మొదట షిరిడీ వెళ్ళింది. ఆమె శ్రీసాయిబాబా దర్శనం చేసుకొన్న తరువాత బాబా ఆమెకు ఊదీనిచ్చి యింటికి తిరిగి వెళ్ళిపొమ్మని చెప్పారు. అప్పుడామె పండరీపురం యింకా మిగతా యాత్రా స్థలాలకు వెళ్ళడం మానుకొంది. షిరిడీయే పండరీపూర్ అని భావించింది. యింటికి చేరుకున్న తరువాత అందరికీ ఊదీ పంచుదామని సామానులు విప్పగా అది కనపడలేదు. ఊదీకి బదులుగా పండరీపూర్ లో విగ్రహాన్ని దర్శించుకున్నపుడు ఇవ్వబడే బుక్కా (వివిధ రకాలతో తయారుచేయబడే పరిమళ భరితమైన పొడరు) కనిపించింది. ఈమార్పుకు ఆమెకు చాలా ఆశ్చర్యం వేసింది. ఆమె షిరిడీనే పండరీపూర్ గా భావించినందు వల్ల ఆమెకు పండరీపూర్ ప్రసాదమే లభించింది.

మాటిచ్చి అశ్రద్ధ చూపకు:

1915 స.వ.లో నేను, నాభార్య, నాబావమరిది శంకరరావు అందరమూ కలిసి షిరిడికి బయలుదేరాము. దారిలో మాకు బాసిన్ లో వెటరినరీ శానిటరీ ఆఫీసరుగా పని చేస్తున్న వాసుదేవ సీతారాం సామంత్ కలిసారు.

మేము షిరిడీ వెడుతున్నామని తెలిసి ఆయన నాచేతికి రెండణాలు యిచ్చి దానితో కొబ్బరికాయ, అగరువత్తులు, కర్పూరం కొని తన తరఫున శ్రీసాయిబాబాకు సమర్పించమని చెప్పారు. సరేనని నేను పైకం తీసుకున్నాను. బాబాను దర్శించుకున్న తరువాత షిరిడీనుండి తిరుగు ప్రయాణమయి బాబావద్ద శెలవు తీసుకోవడానికి వెళ్ళినపుడు బాబా నాతో "మంచిది, వెళ్ళేటప్పుడు చితలీ మీదుగా వెళ్ళు అని , రెండణాలు గురించి కొబ్బరికాయ, అగరువత్తులు కర్పూరం గురించి అడిగి అవి యివ్వకుండా ఈ పేద బ్రాహ్మడిని ఎందుకు మోసం చేస్తావు" అన్నారు. అప్పుడు నాకా రెండణాల విషయం గుర్తుకు వచ్చి వెంటనే వెళ్ళి ఆరెండణాలతో కొబ్బరికాయ, అగరువత్తులు, కర్పూరం కొని బాబాకు సమర్పించాను. అప్పుడు బాబా నేను వెళ్ళడానికి అనుమతిస్తూ "వెళ్ళిరా ! కాని, ఏదయినా ఒక పని చేస్తానని ఒప్పుకుంటే శ్రద్ధగా చెయ్యి. లేకపోతే అసలు మాట ఇవ్వనేవద్దు" అన్నారు.

సాయిబానిస శ్రీరావాడ గోపాలరావుగారు రచించిన ఆనాటి ఋషులు – నేటి షిరిడీ సాయి నుండి…

సనాతన ధర్మంలో త్రేతాయుగము, ద్వాపర యుగములోని ఆనాటి ఋషులు, ఈనాటి కలియుగములోని షిరిడీ సాయి.

(గత సంచిక తరువాయి)

10. దత్తాత్రేయ మహర్షి : అత్రి అనసూయల కుమారుడు దత్తాత్రేయుడు అంతరంగమున తపోధ్యానపరుడు. బహిరంగముగా మద్యపానము చేయువాడుగా కనిపించువాడు. కార్తవీర్యార్జునుడు అనే రాజు దత్తాత్రేయమహర్షి అనుగ్రహము సంపదించుకొనుటకు ప్రతిరోజు మహర్షి ఆశ్రమమునకు వెళ్ళి ఆయన పాదములు ఒత్తుచూ వారికి మద్యమాంసాదులు ఆహారముగా సమర్పించుచుండెను. దత్తాత్రేయుడు అడవిలో ఉన్మత్తునివలె తిరుగుచుండెను. శ్రీసాయి దత్తాత్రేయుని అవతారము. వారు ద్వారకామాయిలో పొగాకు చిలుము పీల్చుతూ తన అంకిత భక్తులకు చిలుము అందించుతూ ఉండేవారు. భక్తులు ఆయన పాదాలు ఒత్తుచుండెడివారు. శ్రీసాయి సత్ చరిత్ర 38వ.అధ్యాయములో చెపబడిన విషయాలు గుర్తు చేసుకొందాము. శ్రీసాయి అప్పుడప్పుడు ద్వారకామాయిలో మాంసపు పలావు వండి భగవంతునికి నైవేద్యము సమర్పించి దానిని మాంసాహారము తిను భక్తులకు వడ్డించేవారు. శ్రీసాయి షిరిడీకి వచ్చిన కొత్తలో షిరిడీ ప్రజలు ఆయనను చూసి పిచ్చిఫకీర్ అని భావించేవారు.

11. విశ్వామిత్ర మహర్షి : క్షత్రియ వంశంలో పుట్టి రాజర్షియై తుదకు బ్రహ్మర్షియై ఆ చంద్రార్కమైన కీర్తి గడించిన ముని విశ్వామిత్రుడు. విశ్వామిత్రముని వశిష్ఠముని ముందు అనేక మార్లు ఓడిపోయినా పట్టుదలతో తపస్సు చేసి బ్రహ్మర్షి స్థానాన్ని పొందినాడు. అలాగే శ్రీసాయినాధులువారు మౌనుద్దీన్ తంబోలితో ఈ ప్రాపంచిక రంగములో ఓడిపోయి భగవంతుని రాజ్యములో రాజాధిరాజ యోగిరాజ్ స్థానాన్ని పొందగలిగారు. విశ్వామిత్రముని తన యాగ సంరక్షణార్ధము శ్రీరామ లక్ష్మణులను అరణ్యముల గుండా తీసుకొని వెళుతూ తమ ఎదుట తారసబడిన ఓ స్త్రీని సంహరించమని శ్రీరామునికి ఆదేశము ఇచ్చి శ్రీరామచంద్రునిలోని గురువాక్య పరిపాలన ఆలోచనలను పరీక్షించినాడు. అదే విధముగా శ్రీసాయి తన అంకిత భక్తుడు కాకాసాహెబ్ దీక్షిత్ ను పిలిచి కత్తిని ఇచ్చి ఒక వేటుతో మేక తలను నరకమని ఆదేశించి గురువాక్య పరిపాలన అనే ఆలోచనలను పరీక్షించినారు. విశ్వామిత్రుడు జన్మతః క్షత్రియుడు మరియు శ్రీసాయినాధులవారు తన జన్మ రహస్యాలను తన భక్తులకు తెలియచేయకపోయినా సాయి సత్ చరిత్ర 33 వ. అధ్యాయములో జామ్ నేర్ చమత్కారములో బాబా మైనతాయిని పురిటి నొప్పుల నుండి కాపాడిన ఘట్టములో రామ్ గిరి బువాకు తాను “గర్వాల్ దేశపు క్షత్రియుడిని” అని తెలియచేసి రామ్ గిరి బువాచేత ఫలహారము తినిపించెను. బాబా తాను ఏనాడు అసత్యము చెప్పలేదు అని ద్వారకామాయిలోని తన భక్తులకు తెలియచేసియున్నారు. మరి తాను “గర్ వాల్ దేశపుక్షత్రియుడిని” అని చెప్పటములోని

అర్ధము ఏమిటి?  నా ఉద్దేశములో విశ్వామిత్రముని లాగా షిరిడి సాయిబాబా కూడా క్షత్రియుడే అని నేను నమ్ముతున్నాను. ఇది నాస్వంత ఆలోచన.

(సమాప్తమ్)

(తరువాతి సంచిక నుండి షిరిడీ సాయ్ క్యాలండర్ --- షిరిడీలో జరిగిన ముఖ్య సంఘటనలు..130 సంవత్సరములు)

ఆనాటి ఋషులు నేటి షిరిడి సాయి పై సాయిబానిస శ్రీరావాడ గోపాలరావుగారి ఉపన్యాసము ఈ క్రింద ఇచ్చిన లింక్ ద్వారా వినండి.

https://youtu.be/rRQSXpqRJ_Q

https://youtu.be/rRQSXpqRJ_Q

https://youtu.be/Gb-DN1pCBt8

## సాయి ఉపాసక్ కలం నుండి ......



ఈ నెల 25వ.తారీకున ఆట్లాంటా (అమెరిక) వెడుతున్న సందర్భముగా పత్రికను ముందుగానే విడుదల చేయడం జరిగింది.

**అట్లాంటాలో** ఆరునెలల పాటు ఉంటాను. జూన్ నెలనుంచి పత్రిక అట్లాంటానుంచి విడుదల చేస్తూ ఉంటాను.

సాయి ఉపాసక్

త్యాగరాజు